ప్రజాశక్తి
శుక్రవారం 05 జులై 2024
5
కర్నూలు





నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష

విద్యాసంస్థల బంద్ విజయవంతం

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి - ఎన్‌టిఎను రద్దు చేయాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్ - కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలను నివారించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం పై విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ కర్నూలు జిల్లాలో విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలను మూసి వేసి విద్యార్థి సంఘాలు చేపట్టిన బంద్‌కు యాజమాన్యాలు సహకరించాయి. కర్నూలు నగరంలో విద్యార్థి సంఘాలు ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, పిడిఎస్‌ఒ ల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బందును జయప్రదం చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో నిరసన తెలిపారు. జిల్లా కలెక్టర్ పి రంజిత్ భాషాకు విద్యార్థి సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఐసా రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సాబీర్ పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు రమణ, పిడిఎస్‌ఒ జిల్లా నాయకులు తిరుమలేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకే జరిగిందని విద్యార్థులు ,విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు ప్రజాసంఘాల నాయకులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగానే ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేయడమే అనేసి వారన్నారు. నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ తిరిగి నిర్వహించాలని అదేవిధంగా నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఎన్‌టిఎ సంస్థను రద్దు చేయాలన్నారు. నీట్ పేపర్ లీకేజ్‌కు బాధ్యత వయస్సు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకి అప్పగించాలన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ప్రధానంగా ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటులో చర్చ జరగాలని అడుగుతుంటే ప్రతిపక్షాల గొంతును నొక్కుతుందన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోడీ నీట్ పేపర్ లీకేజ్ కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాలలో విద్యార్థి సంఘాల నాయకులు వారి హక్కుల కోసం ఆందోళన చేస్తుంటే అక్రమంగా అరెస్ట్ చేసి పెట్టిన కేసులు ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, జిల్లా నాయకులు రామకృష్ణ, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి సాయిఅమర్, ఎఐఎస్‌ఎఫ్ నగర నాయకులు శరత్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు కలెక్టరేట్ వద్ద నిరసన చేపడుతున్న నాయకులు



నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అల్లూరి ఒక పోరాట స్ఫూర్తి

- అల్లూరి జయంతిలో కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అల్లూరి సీతారామరాజు ఒక పోరాట స్ఫూర్తిఅని, వారి ధైర్య సాహసాలు యువతకు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కొనియాడారు. గురువారం అల్లూరి సీతారామ రాజు 126వ జయంతి సందర్భంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటాని కి కలెక్టర్ పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ... స్వాతంత్య్ర చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని.. ఆయన జరిపిన పోరాటం స్వాతంత్య్ర ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొని తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని చాటుకున్న విప్లవ వీరుడన్నారు. జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదనరావు, జిల్లా గిరిజన, సాంఘిక సంక్షేమ అధికారి రంగలక్ష్మి దేవి, డిపిఒ నాగరాజు నాయుడు, కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు, రవిశాస్త్రి, శాంతకుమార్, శామ్యూల్, ప్రభుదాస్, రమేష్‌బాబు, నవీన్‌కుమార్, సాయిప్రదీప్, ఉద్యోగ సంఘ నాయకులు మద్దిలేటి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఆర్‌యులో అల్లూరి జయంతి : రాయలసీమ యూనివర్సిటీలోని వైస్ ఛాన్సలర్ కాన్ఫరెన్స్ హాల్లో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వర్సిటీ రెక్టార్ ఎన్‌టికె నాయక్, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని సూచించారు. స్వాతంత్ర పోరాటంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సిడిసి డీన్ సివి కృష్ణారెడ్డి ప్రొఫెసర్లు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ పేర్కొన్నారు. అల్లూరి 126వ జయంతి సందర్భంగా నగరపాలక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.కమిషనర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం.. స్వయంపాలన కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతకు ఆదర్శనీయమైనదన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆరోగ్యధికారి విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఒ. జునైద్, సూపరింటెండెంట్లు మంజూర్‌బాష, ప్రసాద్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.





నగర పాలక సంస్థ కార్యాలయంలో

తవ్వి వదిలేసిన రోడ్డును నిర్మించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు ఇందిరా గాంధీ నగర్‌లో గత ఆరు నెలల క్రితం బి. క్యాంప్ పంపింగ్ లైన్ కోసం జెసిబిలతో తవ్వి వదిలేసిన సిసి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. సిపిఎం 43వ వార్డు కార్యకర్తలు ఎం.భాస్కర్, ఎ.శ్రీనివాసులు. ఆర్.మద్దిలేటి. సుల్తాన్ బాషతో కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు, డ్రైనేజీ కాలువ సమస్యలను పరిశీలించారు. సిపిఎం నగర కార్యదర్శి టి .రాముడు మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల ప్రజా ప్రతినిధులు అధికారులు నిర్లక్ష్య ధోరణితో ఉన్నారని విమర్శించారు. కార్పొరేషన్ పరిధిలోని బి.క్యాంపుకు వెళ్లే పంపింగ్ లైన్ ఇల్లూరునగర్ రైల్వే కాంపౌండ్ కింది భాగంలో పగిలిపోవడంతో వారం రోజులుగా బికాంప్ ప్రజలు తాగునీటి సమస్యతో బాధపడుతున్నారని, పంపింగ్ లైన్‌ను బైపాస్ చేసి ఇల్లూరు నగర్ ఇందిరాగాంధి నగర్‌లో ఉండే సిసి రోడ్లను రాత్రికి రాత్రి జెసిపిలతో తవ్వేసి ప్రజల ఇళ్లకు ఇచ్చిన కొళాయి కనెక్షన్‌లు అన్నీ కట్ చేసి పంపింగ్ లైన్ నిర్మాణాన్ని చేపట్టారని పైప్ లైన్ నిర్మాణం కోసం స్థానిక ప్రజలు అన్ని విధాలుగా సహకరించారు. కానీ ప్రజలు గత ఆరు నెలలుగా తవ్వేసిన రోడ్డు నిర్మాణం కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నార న్నారు. మూడు నెలల క్రితం కమిషనర్ దృష్టికి తెచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూలుకు వెళ్లే పిల్లలు వృద్ధులు రోజూ కిందపడి దెబ్బలు తగిలించుకుంటున్నారని, ఇప్పటికైనా కమిషనర్ వెంటనే ఈ సమస్యపై దృష్టి పెట్టి తవ్వేసిన సిసి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని డ్రెయినేజీ కాలువ నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.



సమస్యలను పరిశీలిస్తున్న నాయకులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ రంజిత్ బాషా
- వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ రంజిత్ బాషా వైద్యరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు తాను బాపట్ల కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఒక యాప్ ను రూపొందించి అమలు చేశామన్నారు. అదే విధంగా ఇక్కడ కూడా యాప్‌ను రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ఈ యాప్‌లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎఎన్‌ఎంలు, అంగన్వాడీ వర్కర్లు లాగిన్ అయి పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించే విధంగా ఉంటుందన్నారు. అన్ని శాఖలు కలిసి హీమోగ్లోబిన్ శాతం, న్యూట్రిషన్, ఇతర ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తూ, తదనంతర చర్యలు తీసుకునే విధంగా యాప్ ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను వెంటనే తెప్పించి కర్నూలు జిల్లాకు అనుగుణంగా రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బాపట్లలో తాను కలెక్టర్‌గా ఉన్న సమయంలో రూపొందించిన యాప్‌కు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ను కూడా తెప్పించి అధికారులకు పంపించారు. ఈ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కలెక్టర్ తెలిపారు. గర్భిణీ స్త్రీలకు వంద శాతం రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన ప్రతి ఒక్క గర్భిణీ స్త్రీని రిజిస్ట్రేషన్ చేసి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అతిసార, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్, డిసిహెచ్ఎస్ డాక్టర్ మాధవి, జిల్లా లెప్రసీ ప్రాజెక్టు ఆఫీసర్, డాక్టర్ భాస్కర్, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, ఆర్‌బిఎస్‌కె జిల్లా కో ఆర్డినేటర్ హేమలత, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మానిటరింగ్ ఆఫీసర్, డాక్టర్ ఉమ, జిల్లా సర్వేలియన్స్ ఆఫీసర్ డాక్టర్ నాగప్రసాద్, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ రంజిత్ బాషా



బడి బయట ఉండే పిల్లలను గుర్తించండి

ఆర్ జెడి రాఘవరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఇంకా బడికి వెళ్లకుండా బడి బయట ఉండే పిల్లలను గుర్తించి వెంటనే పాఠశాలలో చేర్పించాలని పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ వై.రాఘవరెడ్డి, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కర్నూలుకు విచ్చేసిన ఆయన సమగ్ర శిక్ష అభియాన్ సమావేశ భవనంలో మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నమోదును గత ఏడాది కంటే పెంచాలని సూచించారు. పాఠశాల విద్యార్థులకు అందజేసే విద్యా కానుక కిట్ల 100శాతం పంపిణీ పూర్తి చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఎన్‌సిఇఆర్‌టి సిలబస్ బోధన జరిగే వాటికి పాఠ్యపుస్తకాల ఇండెంట్ తెప్పించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన అందేలా చూడాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. శామ్యూల్ ,కర్నూలు డిప్యూటీ డిఇఒ హనుమంతరావు ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు



కర్నూలులో మైనర్ డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిఐ పి.గౌతమి

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలే

మైనర్లకు ట్రాఫిక్ సిఐ కౌన్సిలింగ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : నిబంధనలకు విరుద్ధంగా మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని కర్నూలు ట్రాఫిక్ సిఐ పి. గౌతమి గురువారం హెచ్చరించారు. కెమెరాకు పట్టుబడిన మైనర్లకు ఆమె తన స్టేషన్‌లో కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. కొత్తగా వచ్చిన వాహన చట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు. రూ.25 వేలకు జరిమానా వేసేందుకు అవకాశం ఉందన్నారు. వాహనాలు నడిపేందుకు పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అలా చేస్తే మైనర్లతో పాటు తల్లిదండ్రులు కూడా జైలుకు పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు ఉంటేనే వాహనాలు నడపాలని అన్నారు. ఇతర రికార్డ్సు వాహనాలకు సంబంధించి లేనట్లయితే ఆర్‌టిఒ కార్యాలయానికి కేసును సిఫార్సు చేస్తామన్నారు. ఆర్‌టిఒ కార్యాలయం నుండి ఎన్‌ఒసి ఇచ్చాకే వాహనాలు రిలీజ్ చేస్తామని చెప్పారు.

బిజెపి వైఖరి దుర్మార్గం : కాంగ్రెస్

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

రాహుల్ గాంధీ పార్లమెంట్లో ప్రజా సమస్యలను దళం విప్పుతున్న ఆయన దిష్టిబొమ్మను బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు దగ్ధం చేస్తూ దుర్మార్గ వైఖరికి పాల్పడుతుందని డిసిసి అధ్యక్షుడు కె.బాబురావు విమర్శించారు. గురువారం నగరంలోని స్థానిక డిసిసి కార్యాలయం సమీపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు బాబురావు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ నాయకులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో రాహుల్ గాంధీ హుందాగా వ్యవహరిస్తుంటే మోడీ అమిత్ షాలు మాత్రం ప్రజాస్వామ్యబద్ధంగా ఉండడం లేదన్నారు. కుల మతాల మధ్య చిచ్చు పెట్టే పద్ధతులు మానేయాలన్నారు. అనంతరం మాజీ మంత్రి మూలింటి మారెప్ప , మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో, డిసిసి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, డిసిసి అధ్యక్షులు షేక్ రియాజుద్దీన్, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి. బతుకన్న, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎస్.ప్రమీల, ఎస్సీసెల్ జిల్లా చైర్మన్ ఈ లాజరస్, సిటీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



డిసిసి కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలి

-కర్నూలు జిల్లా కురువ సంఘం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్: దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కురువ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు మాట్లాడుతూ కర్నూలు జిల్లా నందవరం మండలం జోహరాపురం గ్రామస్తులు కురువ మల్లేష్, కురువ నాగేంద్ర, కురువ పరమేష్, సరస్వతమ్మ, పెద్ద రాములమ్మలను పొలం విషయంలో రెడ్డి సామాజిక తరగతికి చెందిన సంజీవరెడ్డి, బాలు రెడ్డి, అర్జున్‌రెడ్డి, రాఘవరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు కొడవళ్లు, రాడ్లు, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ప్రస్తు తం బాధితులు కర్నూలు ప్రభుత్వ సర్వ జన వైద్యశాలలో చికిత్స పొందు తున్నారని తెలిపారు. సంఘం నాయ కులు తవుడు శ్రీని వాసులు, బిసి.తిరుపాలు,పెద్దపాడు పుల్లన్న ,రాయలసీమ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్, సుంకన్నలు బాధితులను పరామర్శించారు.



10న కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 10న డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ కోరారు. గురువారం కర్నూలు న్యాసిటీ ఆఫీస్ బేరర్స్ కమిటీ సమావేశం కార్మిక కర్షక భవన్‌లో నిర్వహించారు. కార్మిక వ్యతిరేక చట్టాలు చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 10న దేశవ్యాప్తంగా కార్మికుల డిమాండ్స్ డే నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26,000 అమలు చేయాలని, నూతన పెన్షన్ స్కీమును రద్దుచేసి ,ఓల్డ్ పెన్షన్ స్కీమును అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలను అమలుచేయాలని, రవాణా రంగా కార్మికులకు హాని కలిగించే హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఇఎస్ఐ పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ,అంగన్వాడి,ఆశా,మధ్యాహ్న భోజనపథకం,నేషనల్ హెల్త్ మిషన్ సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా,ఉపాధి హామీ, నేకో,ఆయుష్ సేంద్రియ వ్యవసాయం,108, 104, తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులు గా గుర్తించాలన్నారు. .కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, కంటెంజెంట్, పార్ట్ టైం, గెస్ట్ తదితర కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్టరు తొలగించినా , కార్మికులను తొలగించరాదని, సమాన పనికి సమాన వేతనం చెల్లించి రెగ్యులర్ చేయాలన్నారు. ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీ పథకాలను నిలుపుదల చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలరని తదితర డిమాండ్స్ తో కలెక్టరేట్ ఎదుట ధర్నాకు భారీగా తరలిరావాలన్నారు. సిఐటియు నగర కార్యదర్శివర్గసభ్యులు టి.రాముడు, కె.సుధాకరప్ప, జిఎస్, కే.ప్రభాకర్, ఎస్.మహమ్మద్ రఫీ, ఇ.విజయుడు ఎం.వెంకటేశ్వర్లు, మనోహర్, ఎస్. హుస్సేన్ వలి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిఎస్.రాధాకృష్ణ



కలెక్టర్‌కు శుభకాంక్షలు తెలుపుతున్నదూదేకుల సంఘం నాయకులు

కలెక్టరుకు దూదేకుల సంఘం శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు దుయోకుల సంఘం జిల్లా నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దూదేకుల సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ బాబన్, ఆదోని సాయిబాబా, కర్నూలు జిల్లా దూదేకుల సంఘం అధ్యక్షుడు డిఎస్‌పి మహబూబ్ బాషాలు జిల్లా కలెక్టరుకు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి దస్తగిరి పర్ల, కర్నూలు సంఘం నాయకులు సిద్దయ్య, మస్తాన్, నంద్యాలనాయకులు షేక్షావాలి, హుసేనప్ప, ఆదాం, ఆదోని నాయకులు షేక్షావలి,టిప్పుసుల్తాన్,ఉమ్మడిజిల్లావివిధ ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.



క్రిష్ణగిరి మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెఇ.శాంకుమార్

సమన్వయంతో ప్రజా సమస్యలను పరిష్కరించండి

ఎమ్మెల్యే కెఇ. శ్యాం కుమార్

ప్రజాశక్తి - క్రిష్ణగిరి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంలో అభివృద్ధి పనులు చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యాంకుమార్ సూచించారు.

క్రిష్ణగిరి ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్ అధ్యక్షతన మండలపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదటిగా వివిధ శాఖల ప్రగతిపై సమీక్షించారు. ముఖ్యఅతిథి పత్తికొండ ఎమ్మెల్యేశ్యాకుమార్ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన పలు అంశాలను అజెండాలో పొందుపరిచి, వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని, ఖరీఫ్ సీజన్లో రైతులకు విత్తనాలు, ఎరువుల అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ప్రజాప్రయోజనాలకు పెద్దపీట వేసే విధంగా అధికారులు, అనధికారులు పనిచేయాలని తెలిపారు. యువ నాయకుడు కెఇ నందీష్ బాబు, ఆలం కొండ నబిసాహెబ్, టిడిపి మండల అధ్యక్షుడు మద్రి శ్రీరాములు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు దామోదర్ నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

- జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ సలీం బాషా

ప్రజాశక్తి - హొళగుంద

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, సంపూర్ణ ఆరోగ్య ఉత్సవంలో కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ సలీం బాషా, సిపిఒ ప్రభాకర్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రస్తుత జీవన శైలిలో ప్రతిఒక్కరూ మార్పు కోరుకోవాలని, చిరుధాన్యాల వైపు అడుగులు వేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజుకు 5 లీటర్లకు తక్కువ కాకుండా నీరు తాగాలన్నారు. బొప్పాయి, దానిమ్మ తదితర పండ్లను తినాలన్నారు. సి విటమిన్ ఎక్కువగా ఉండే జామ పండు, నిమ్మ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారం ప్రతి ఒక్కరికీ అవసరమని తెలిపారు. డిఆర్‌డిఎ ద్వారా పొదుపు మహిళలను ఆర్థికంగా ఆదుకొని బలోపేతం చేస్తామన్నారు. వ్యవసాయ, ఐకెపి తదితర శాఖలను కలుపుకొని ముందుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థను భాగస్వామ్యం చేసుకొని ముందుకెళ్తున్నట్లు చెప్పారు. జడ్‌పి వైస్ ఛైర్మన్ బుజ్జమ్మ, మండల ప్రత్యేకాధికారి, వెటర్నరీ జెడి.శ్రీనివాస్, డివిజనల్ పంచాయతీ అధికారి నాగేశ్వరరావు, ఎంపిడిఒ కె.ఆజాద్, ఎంపిపి నూర్జహాన్‌బీ, ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రెసిడెంట్ సిహెచ్.నాగరాజు పాల్గొన్నారు.

బాబు, కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం


కేక్ కట్ చేసి గురురాజ్ దేశాయ్‌కి తినిపిస్తున్న వికలాంగులు

ప్రజాశక్తి - నందవరం

వికలాంగుల పింఛను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో వికలాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. పాలాభిషేకానికి ముఖ్యఅతిథిగా దేశాయి నెట్‌వర్క్ అధినేత, టిడిపి మండల నాయకులు గురురాజ్ దేశాయి, ఎంపిడిఒ కిరణ్ మోహన్ హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వికలాంగులు, నాయకులు కలిసి మందుగా కేకు కట్ చేసి ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మందకృష్ణ మాదిగ, కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గురురాజ్ దేశాయ్ మాట్లాడారు. వికలాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారన్నారు. గత వైసిపి ప్రభుత్వం వికలాంగులను పట్టించుకోకుండా కేవలం రూ.3 వేల పింఛను ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. వికలాంగుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామన్నారు.

ఉద్యోగులు అందుబాటులో ఉండాలి

- టిడిపి నాయకులు రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


రాఘవేంద్ర రెడ్డిని సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగులు సకాలంలో కార్యాలయాలకు చేరుకొని ప్రజలకు అందుబాటులో ఉండాలని టిడిపి నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి కోరారు. గురువారం సచివాలయ ఉద్యోగులు మండలంలోని మాధవరం గ్రామంలోని రాఘవేంద్రరెడ్డి స్వగృహంలో ఆయనను, ఆయన సోదరులు రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చిన వారికి వీలైనంత త్వరగా పరిష్కరించి పంపాలని కోరారు. వివిధ శాఖలకు సంబంధించిన మండల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థుల బైఠాయింపు ఉద్రిక్తత

- స్తంభించిన ట్రాఫిక్
- నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విద్యాసంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో విద్యార్థులు చేపట్టిన బంద్ ఉద్రిక్తతకు దారి తీసింది. పట్టణంలోని మున్సిపల్ రోడ్డు భీమాస్ కూడలి వరకు ఊరేగింపుగా చేరుకున్నారు. అక్కడ సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించారు. రోడ్డుపై వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ స్తంభించింది. అక్కడికి చేరుకున్న టూటౌన్ పోలీసులు నాయకులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అధికారులు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. చేసేదిలేక పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ దేశవ్యాప్త బంద్‌లో భాగంగా గురువారం ఆదోని పట్టణంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఎఐఎస్‌ఎఫ్ డివిజన్ కార్యదర్శి దస్తగిరి, పిడియుఎస్ జిల్లా అధ్యక్షులు అఖండ, జిల్లా కోశాధికారి సోమశేఖర్, పిడిఎస్‌ఒ డివిజన్ అధ్యక్షులు శివ, డిఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, బిడిఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, ఆర్‌పిఎస్‌ఎఫ్ డివిజన్ కార్యదర్శి బాలు మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్య శాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకి అప్పగించాలని, దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ప్రధానంగా ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్‌లో చర్చ జరగాలని అడుగుతుంటే ప్రతిపక్షాల గొంతును హరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీకి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల నాయకులు వారి హక్కుల కోసం ఆందోళన చేస్తుంటే అక్రమంగా అరెస్టు చేసి పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. లేకపోతే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షులు శశిధర్, నాగరాజు, సూరి, గణేష్, సంతోష్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** మండలంలో ఉన్న విద్యాసంస్థలు విద్యార్థి సంఘాల పిలుపుతో బంద్ పాటించాయి. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ కుమార్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర నాయుడు, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మహేంద్ర, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్, ఐసా జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు, పిడిఎస్‌ఒ నాయకులు ప్రతాప్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు రోడ్ల మీదకొచ్చి ఆందోళనలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ తిరిగి నిర్వహించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ స్పందించి నీట్ పేపర్ లీకేజీకి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాము, ప్రమోద్, ఆనంద్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు రంగస్వామి, పిడిఎస్‌యు పట్టణ కార్యదర్శి రామకృష్ణ, వంశీ, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు. **దేవనకొండ**లో ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఎఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి కె.భాస్కర్, మాట్లాడారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మహబూబ్ బాషా, డివైఎఫ్‌ఐ మండల సహాయ కార్యదర్శి చిన్న, వీరేందర్ నాయుడు, ఎఐఎస్‌ఎఫ్ మండల నాయకులు మధు, డివైఎఫ్‌ఐ నాయకులు మురళీ, రాకేష్, వేణు పాల్గొన్నారు. **నందవరం** నందవరంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలను బంద్ చేయించినట్లు ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు నితీష్ తెలిపారు. నాయకులు అబ్దుల్, రత్నం, రాజేష్, ఆశీర్వాదం పాల్గొన్నారు. **ఆలూరు**లో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి గిరి మూర్తి, పిడిఎస్‌యు ఈ.మధు, అమేష్, వెంకటేష్ నాయక్, నరసింహ, ఎస్‌ఎఫ్‌ఐ మండల ఉపాధ్యక్షులు గిరి, మండల నాయకులు శివరాజ్, రవి, వినోద్, బసవ, శంకర్ పాల్గొన్నారు. **పెద్దకడబూరు**లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు కె.విల్సన్, మోషే, సతీష్, కళ్యాణ్, బాలు, రాజు, యువరాజ్ మాట్లాడారు.


ఆదోనిలో మాట్లాడుతున్న శ్రీనివాసులు



ఎమ్మిగనూరులో నిరసన చేపడుతున్న నాయకులు



ఆలూరులో నిరసన చేపడుతున్న నాయకులు

రైతుల దరఖాస్తులను పరిష్కరించండి

- ఎఒ జయలక్ష్మి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ పథకాలపై రైతులు తీసుకొచ్చే ప్రతి దరఖాస్తును కూడా పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎఒ జయలక్ష్మి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. గురువారం చిప్పగిరి వ్యవసాయ కార్యాలయంలో ఎఇఒ రమాదేవి ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిఎం కిసాన్, తదితర పథకాలకు అర్హత ఉండి పొందలేని రైతులు ఉంటే వారిని వెంటనే గుర్తించి ఆ రైతుల దగ్గర సమాచారం స్వీకరించి పరిష్కరించాలని కోరారు. మట్టి నమూనాలను కూడా తీసుకోవాలన్నారు. వ్యవసాయ కార్యాలయాలకు వచ్చే రైతులను అశ్రద్ధ చేయకుండా తగిన సూచనలు ఇస్తూ అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం ఏ సమాచారం అడిగినా వెంటనే తెలిపేలా సమాచారం ఉంచుకోవాలన్నారు. ఈ శనివారం జరిగే ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమానికి వ్యవసాయ సిబ్బంది అంతా హాజరు కావాలని కోరారు.


అగ్రికల్చర్ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఎఒ జయలక్ష్మి

పొలం విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

- 11 మందికి గాయాలు - ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - నందవరం


దాడిలో గాయపడిన క్షతగాత్రుడు

మజరా గ్రామమైన జహరపురం గ్రామంలో పొలం విషయంలో ఇరు వర్గాలు ఒకరిపైఒకరు దాడి చేసుకోవడంతో 11 మందికి గాయాలు కాగా, అందులో ఒకరు పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల మేరకు... గ్రామంలోని సర్వే నెంబర్ 6/బిలో 6.82 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో కురువ నాగరాజు కుటుంబానికి, హనుమంతు రెడ్డి కుటుంబానికి ఆ పొలంలో 60 సెంట్ల భూమి 'మాది' అంటూ గత రెండేళ్లుగా వాదనలు చేసుకుంటున్నారు. అందులో భాగంగా గురువారం పొలంలో విత్తనం వేయడానికి రెండు వర్గాల వారు వెళ్లారు. ఒకరిపై ఒకరు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసుకున్నారు. అందులో కురువ పెద్ద రాములమ్మ, సరస్వతి, ఆంజనేయులు, నాగేంద్ర, పరమేష్, శివ, శంకరప్ప, నాగరాజుకు గాయాలయ్యాయి. రాములమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహేశ్వర రెడ్డి కుటుంబంలోని ఇద్దరికి గాయాలు కాగా వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి అవినీతిపై రహస్య ఒప్పందం..!

- సామాజిక తనిఖీ పేరుతో రూ.లక్షలు దండుకుంటున్న ఎస్‌ఆర్‌పి, డిఆర్‌పిలు - తూతూమంత్రంగా గ్రామసభ..?

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

గ్రామాల్లో వలసలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టింది. కొందరు అవినీతి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఉపాధి హామీ చట్టం లక్ష్యం నీరుగారుతోంది. సిబ్బంది అవినీతికి పాల్పడుతుండడంతో నిధులు వృథా అవుతున్నాయి.

2023-24 సంవత్సరానికి గానూ మండలంలోని 16 పంచాయతీల్లో ఉపాధి హామీ చట్టం కింది పనులు జరిగాయి. ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిని బయట పెట్టడానికి అధికారులు సామాజిక తనిఖీలు చేపడుతున్నారు. అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ఉపాధి హామీ పనులకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు రహస్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. సామాజిక తనిఖీలు చేయడానికి వచ్చిన సిబ్బందికి ముడుపులు ముట్టజెప్పి అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించినట్లు గ్రామస్తులు గుసగుసలాడుతున్నారు. మండలంలోని కడిమెట్ల, కందనాతి, టిఎస్.కుల్లూరు, బనవాసి గ్రామాల్లో ఎక్కువ అవినీతి జరిగినట్లు డిఆర్‌పిలు పేర్కొంటున్నారు. కందనాతి గ్రామంలో ఉపాధి హామీ చట్టం కింద 180 పనులు చేపట్టారు. 50 పనులు హౌసింగ్, 40 పనులు హార్టికల్చర్, 17 ఫారంపాండ్స్, 40 కాలువలు, 809 పింఛన్లలో సామాజిక తనిఖీ చేపట్టారు. 20 మంది రైతులు హార్టికల్చర్ నుంచి రూ.20 వేల లబ్ధి పొందితే వారి పొలాల్లో కనీసం ఒక్క మొక్క కూడా లేకపోవడం వల్ల రూ.4 లక్షల అవినీతి జరిగినట్లు తెలిసింది. దీనికి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎపిఒలే కారణమని సమాచారం. ఈ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి డిఆర్‌పిలు, ఎస్‌ఆర్‌పి, టెక్నికల్ అసిస్టెంట్లు కుమ్మక్కై గ్రామస్తులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గ్రామసభ నిర్వహించి గుట్టుచప్పుడు కాకుండా ముగించారు. దీన్ని బట్టి చూస్తే ఎంత అవినీతి జరిగిందో అర్థమవుతోంది. నేడు జరిగే 17వ విడత సామాజిక ప్రజావేదికలో అవినీతి ఎంత అని బట్టబయలు అవుతుంది.


కందనాతిలో నిర్వహిస్తున్న గ్రామసభ

నేడు సామాజిక తనిఖీ, ప్రజావేదిక

- ఎపిఒ విజయమోహన్

మండలంలోని 16 పంచాయతీలకు గాను ఉపాధి హామీ చట్టంలో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎపిఒ విజయమోహన్ తెలిపారు. ఈ సామాజిక తనిఖీ, ప్రజావేదిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు ఉంటుందని చెప్పారు.



కలుషిత నీటితో రోగాల బారిన ప్రజలు

- జనసేన మండల నాయకులు రామాంజనేయులు

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళంలో రోజురోజుకు తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని జనసేన మండల నాయకులు రామాంజనేయులు అధికారులపై మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడారు. కౌతాళంలో గత 3 నెలల నుంచి ఇదే పరిస్థితి ఉందని, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, సర్పంచికి చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఓవైపు జిల్లా అధికారులు డయేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారని, కిందిస్థాయిలో అధికారులు ఫిల్టర్ కాకుండా నీరు వదలడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వదిలిన తాగునీటిలో పురుగులు, బురుగు వస్తున్నాయని తెలిపారు. అధికారులు మేల్కొని తాగునీటి విషయంలో జోక్యం చేసుకుని శుద్ధి చేసిన తాగునీటిని అందించాలని కోరారు. లేకపోతే తాగునీటి సమస్యపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

భూ సర్వేలో అవకతవకలు

- కారుమంచి గ్రామస్తులు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని కారుమంచి గ్రామంలో నిర్వహించిన భూసర్వేలో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు శివానంద, జోగి రంగప్ప, హరిజన శ్రీరాములు, చంద్ర తెలిపారు. గురువారం స్థానిక గాంధీ పార్కులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భూ హక్కు చట్టం ద్వారా రాష్ట్రంలో భూ సర్వే కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. అందులో భాగంగా కారుమంచి గ్రామంలో భూసర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారని చెప్పారు. చేతివాటం చూపించి ఒకరి సర్వే నెంబరు మరొకరు పేరుపై ఎక్కించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. లేకపోతే అంబేద్కర్ సర్కిల్‌లో గ్రామస్తులంతా కలిసి ఈనెల 27న నిరాహార దీక్షకు కూర్చుంటామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న కారుమంచి గ్రామస్తులు

పెండింగ్ ఉపాధి వేతనాలు చెల్లించండి : వ్యకాస

ప్రజాశక్తి - దేవనకొండ

గత వేసవిలో పని చేసిన ఉపాధి హామీ వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం వ్యకాస ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం ముందు ఇఒఆర్‌డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో 6 నుంచి 7 వారాల ఉపాధి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఎర్రటి ఎండలో కష్టం చేసినా వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం కూలీలను ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం మారిన తర్వాత మండలంలోని కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు పెట్టడం లేదని, రాజకీయాలకతీతంగా కూలీల అవసరాల కోసం, వలసలు నివారణ నివారణ కోసం పనులు చేపట్టాలని కోరారు. డిమాండ్ ఉన్న ప్రాంతంలో ఉపాధి పనులు కొనసాగించాలని, ప్రభుత్వం కూడా 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు అశోక్, శ్రీనివాసులు, వీరేంద్ర, మురళీ, రాఘవేంద్ర, రామాంజనేయులు, మస్తాన్, రవి పాల్గొన్నారు.


వినతి పత్రం అందిస్తున్న వ్యకాస నాయకులు

బీసీలకు రక్షణ చట్టం చేయాలి

- బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుల దస్తగిరి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

బీసీలకు రక్షణ చట్టం చేయాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆదోనిలోని కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రక్షణ చట్టం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. బీసీలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని, బీసీ హాస్టళ్లకు నూతన భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేంద్రంలో పార్లమెంట్ సమావేశాల్లో ఓబీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు. డివిజన్ గౌరవ సలహాదారులు దేవిశెట్టి ప్రకాష్, తాలూకా గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వరరావు, ఆదోని పట్టణ ఉపాధ్యక్షులు వడ్డే శ్రీనివాసులు, పట్టణ గౌరవ సలహాదారులు, డాక్టర్ యు.సోమశేఖర్, కపటి వీరభద్ర, మల్లేశ్వరప్ప, ఎం.ఉరుకుంద పాల్గొన్నారు.

శ్రీమఠంలో ఆదోని జడ్జి సుధ

ప్రజాశక్తి - మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి పిజె.సుధ తన సోదరునితో కలిసి దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గోపినాథ్ సిబ్బందితో కలిసి ఆమెకు భద్రత కల్పించారు.

రాహుల్ వ్యాఖ్యలను వక్రీకరించడం తగదు

- కాంగ్రెస్ నాయకుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

రాహుల్ గాంధీ వ్యాఖ్యలను వక్రీకరించడం తగదని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గురువారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేయడానికి వ్యతిరేకంగా ఆదోనిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదోని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ ఢోకా మాట్లాడారు. హింసను ప్రేరేపించేవాడు, విధ్వంసాలను సృష్టించేవాడు హిందువు కాదని లోక్‌సభలో రాహుల్ గాంధీ అన్నారే తప్ప హిందువుల మనోభావాలు దెబ్బ తీయలేదని తెలిపారు. గత పదేళ్లలో బిజెపి చేసిందేమీ లేదన్నారు. గత బిజెపి ప్రభుత్వ హయాంలో మణిపూర్ ఘటన దేశానికే తలవంపు అన్నారు. యావత్ ప్రపంచం మణిపూర్ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిందని తెలిపారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారని, పౌరులుగా తమ బాధ్యతలను నెరవేరుస్తున్నారని, దేశ ప్రధాని బాధితులను ఓదార్చకపోవడం విచారకరమని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రశ్నల వర్షానికి బిజెపి అల్లాడిపోతుందన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షులు సాయినాథ్, రామకృష్ణా రెడ్డి, పట్టణ యువజన అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, శ్రీనిత్, మండల అధ్యక్షులు మోహన్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు మాణిక్యరాజు, కాంగ్రెస్ నాయకులు రామన్న యాదవ్, హనుమంతు, రఫిక్, నిసార్ అహ్మద్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నాణ్యత లేని భోజనం : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాణ్యత లేని ఆహారాన్ని విద్యార్థులకు అందజేస్తున్నారని, నాసిరకం భోజనం అందిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్‌ఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం రెవెన్యూ అధికారులకు డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో నాణ్యత లేని భోజనం విద్యార్థులకు పెడుతున్నారని, విద్యార్థినులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వైపు నుంచి అనేక రకాల వస్తువులు వస్తున్నా సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతి వల్ల సరైన భోజనాన్ని విద్యార్థినులకు అందజేయడం లేదని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు విచారించి అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సీటు ఇవ్వాలని కోరారు. డివైఎఫ్‌ఐ నాయకులు చిన్న, వీరేంద్ర, మురళీ, నాయుడు పాల్గొన్నారు.


108 ఇఎంటి, పైలెట్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఎమ్మెల్యే పార్థసారథికి వినతి

ప్రజాశక్తి - ఆదోని

108 అంబులెన్స్ సర్వీసులో పని చేసే ఇఎంటి, పైలెట్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గురువారం ఆదోనిలోని మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు, అధ్యక్షులు కిరణ్ కుమార్, జనరల్ సెక్రటరీ నరసింహరావు మాట్లాడారు. 108 అంబులెన్స్ నిర్వహణ ప్రయివేట్ సంస్థలకు కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలని తెలిపారు. 8 గంటల పని విధానం అమలు చేయాలని, ఉద్యోగులు మరణిస్తే రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. రిటైర్‌మెంట్ వయస్సు 60 ఏళ్లకు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన దూదేకుల సంఘం నాయకులు


కలెక్టర్‌తో ఉన్న సంఘం నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

కలెక్టర్ పి.రంజిత్ బాషను దూదేకుల సంఘం నాయకులు కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గురువారం దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు పి.మహబూబ్ బాషా, రాష్ట్ర గౌరవ సలహాదారులు పి.సాయి బాబా, రాష్ట్ర, జిల్లా ఉపాధ్యక్షులు పి.షేక్షావలీ, మాబు సాబ్, జిల్లా కార్యవర్గ నిర్వహణ సభ్యులు ముకన్నా, టిప్పు సుల్తాన్, మంత్రాలయం నాయకులు ఉసేని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాకు మంచి సేవలు అందించి ప్రజాభిమానం పొందాలని ఆకాంక్షించారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఇ.ఎ. నెం.396/2022
ఇన్ ఇ.పి.నెం.153/2016
ఇన్ ఓ.యస్. నెం.215/2014

1.ఎన్. వి.ఆంజనేయులు డైడ్ బై యల్. ఆర్. ఎస్.,
2.నవులూరి నాగ మల్లేశ్వరి దేవి
3.నవులూరి శ్రీనివాస రవి ఫణి కుమార్
... అర్జీదారులు/ డి.హెచ్.అర్స్
-ఎదురి -
ఎ. తిమ్మారెడ్డి ... రెస్పాండెంట్ /జె.డి.ఆర్

రెస్పాండెంట్ కు నోటీసులు

ఎ. తిమ్మారెడ్డి తండ్రి
ఎ.లక్ష్మిరెడ్డి, ఎ.పి.జి.ఎల్.ఐ. డిపార్ట్మెంట్, అసిస్టెంట్ డైరెక్టర్, ఆఫీస్ ఆఫ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఇన్సూరెన్స్, డిస్ట్రిక్ట్ ఇన్సూరెన్స్ ఆఫీస్, ఎఫ్.1,ఓ.బ్లాక్, కలెక్టర్స్ కాంప్లెక్స్, కడప టౌన్ మరియు జిల్లా. ప్రస్తుత నివాసం. ఫ్లాట్. నెంబర్. 204, స్కందాక్షీ పాస్ట్ అవెన్యూ, చాణిక్యపురి కాలనీ వెనుక, మాంటిసోరి హై స్కూల్, ఎ.క్యాంప్ కర్నూలు సిటీ మరియు డోర్. నెం. 46-695-A-1, మేడపైన విజయదుర్గ హాస్పిటల్, బుదవారపేట, కర్నూలు సిటీ.

పై నెంబర్ ఇ.పి లో డి. హెచ్. ఆర్. అయిన ఎన్. వి.ఆంజనేయులు జె.డి. ఆర్ జీతము పైన అటాచ్మెంట్ చేయమని పై కోర్టులో ఈ.పి దాఖలు చేసినాడు. కోర్టు నుండి నోటీసులు వెళ్లిన తర్వాత జె.డి.ఆర్ పని చేస్తున్నటువంటి డ్రాయింగ్ ఆఫీసర్ కోర్టు ఉత్తర్వుల మేరకు జె.డి.ఆర్ జీతమును అటాచ్మెంట్ చేస్తూ కోర్టుకు నెల నెల అటాచ్మెంట్ అమౌంట్ పంపుతామని తెలిపారు. కోర్టు వారు సదరు ఇ.పి మూసి వేశారు. అయితే డి.హెచ్.ఆర్ మధ్యలో మరణించటంతో డి.హెచ్.ఆర్ వారసులుగా చేర్చుటకు సదరు ఇ. పి ని మరల పునరుద్ధరించమని కోరుతూ అర్జీ దాఖలు చేసినారు. ఇందులో రెస్పాండెంట్ అయిన మీకు ఏమైన ఆక్షేపణ ఉన్న 23-7-2024వ తేది పగలు 10.30 గంటలకు పై కోర్టులో మీరు గానీ మీ తరపు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేని యడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని తెలియజేయడమైన.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 23-7-2024

యనమల శ్రీనివాసులు
అర్జీదారు పరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఇ.ఎ. నెం.397/2022 ఇన్ ఇ.పి.నెం.153/2016
ఇన్ ఓ. యస్. నెం.215/2014

1.ఎన్. వి.ఆంజనేయులు డైడ్ బై యల్. ఆర్. ఎస్.,
2.నవులూరి నాగ మల్లేశ్వరి దేవి
3.నవులూరి శ్రీనివాస రవి ఫణి కుమార్
... అర్జీదారులు/ డి.హెచ్.అర్స్
-ఎదురి -
ఎ. తిమ్మారెడ్డి ... రెస్పాండెంట్ /జె.డి.ఆర్

రెస్పాండెంట్ కు నోటీసులు

ఎ. తిమ్మారెడ్డి తండ్రి
ఎ.లక్ష్మిరెడ్డి, ఎ.పి.జి.ఎల్.ఐ. డిపార్ట్మెంట్, అసిస్టెంట్ డైరెక్టర్, ఆఫీస్ ఆఫ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఇన్సూరెన్స్, డిస్ట్రిక్ట్ ఇన్సూరెన్స్ ఆఫీస్, ఎఫ్.1,ఓ.బ్లాక్, కలెక్టర్స్ కాంప్లెక్స్, కడప టౌన్ మరియు జిల్లా. ప్రస్తుత నివాసం. ఫ్లాట్. నెంబర్. 204, స్కందాక్షీ పాస్ట్ అవెన్యూ, చాణిక్యపురి కాలనీ వెనుక, మాంటిసోరి హై స్కూల్, ఎ.క్యాంప్ కర్నూలు సిటీ మరియు డోర్. నెం. 46-695-A-1, మేడపైన విజయదుర్గ హాస్పిటల్, బుదవారపేట, కర్నూలు సిటీ.

పై నెంబర్ ఇ.పి లో డి. హెచ్. ఆర్. అయిన ఎన్. వి.ఆంజనేయులు జె.డి. ఆర్ జీతము పైన అటాచ్మెంట్ చేయమని పై కోర్టులో ఈ.పి దాఖలు చేసినాడు. కోర్టు నుండి నోటీసులు వెళ్లిన తర్వాత జె.డి.ఆర్ పని చేస్తున్నటువంటి డ్రాయింగ్ ఆఫీసర్ కోర్టు ఉత్తర్వుల మేరకు జె.డి.ఆర్ జీతమును అటాచ్మెంట్ చేస్తూ కోర్టుకు నెల నెల అటాచ్మెంట్ అమౌంటు చెల్లిస్తున్నారు. అయితే డి.హెచ్.ఆర్ చనిపోవటంతో ఇ.పి. పిటిషన్లో వారసులుగా చేర్చుకోవలసిన అవసరం ఉన్నందున ఈ ఇ.పి ని పునరుద్ధరించమనికోరుతూ ఇతని వారసులైన ఎన్. నాగ మల్లేశ్వరి దేవి మరియు ఎన్.శ్రీనివాస రవి ఫణి కుమార్ లను వారసులుగా చేర్చమని అర్జీదారులు పై కోర్టులో అర్జీ దాఖలు చేసియున్నారు. ఇందులో రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు నుండి పలుమార్లు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున కోర్టు వారు ఈ పత్రిక ద్వారా సమన్లు తెలియజేయమని ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. కావున మీకు ఏమైన ఆక్షేపణ ఉన్న **23-7-2024వ తేది పగలు 10.30 గంటలకు** పై కోర్టులో మీరు గానీ మీ తరపు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేని యడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని తెలియజేయడమైన.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా:23-7-2024

యనమల శ్రీనివాసులు
అర్జీదారు పరం అడ్వకేటు,
కర్నూలు.